# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజ గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 9 మార్చి 1989 సంచిక 8

# సంపాదకీయము

## మీ జ్ఞాపకశక్తి యెంత?

("How Much Do You Remember?")

జ్ఞాపకశక్తి మానవునకీయబడిన ఆశ్చర్యకరమైన ఒక సాధనము. మానవులు తాము జన్మించినది మొదలుకొని మరణించువరకు జరిగిన సంగతులను ఒక త్రుటికాలములో సునాయాసముగా జ్ఞాపకము చేసికొనగలరు. జ్ఞాపకశక్తి మానవునికి అత్యవసరమైనది. జ్ఞాపకశక్తి లేనియెడల స్నేహ సహవాసములు, ప్రేమానురాగములు అసాధ్యములగును. మనము పనిచేసుకొనుట అసాధ్యమగును. దేవుని యందు విశ్వాసముంచుటకు జ్ఞాపకశక్తి అత్యవసరము. "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని" యాకోబు వ్రాసెను (యాకోబు 1:3). ఈ ఓర్పు యేలాగు కలుగును? గతంలో దేవుని సహాయమువలన మనకష్టములను యిబ్బందులను యేలాగు జయించితిమో జ్ఞాపకము చేసికొనుచు ప్రస్తుతమున్న కష్టములనుండి మరల దేవుని సహాయముతో బయట పడగోరుదుము. ఇది ఓర్పును పుట్టించే విశ్వాసము. సద్భక్తి కలిగి జీవించుటకు జ్ఞాపకశక్తి అత్యవసరమే అయినను దేవుని ప్రజలు దేవుని కృపను సహాయమును తరచు మరచి పోవుదురని బైబిలు మనకు

బయలుపరచుచున్నది. అందువలన విశ్వాసులలో నిరుత్సాహము, విశ్వాస భ్రష్టత్వముకూడ యేర్పడును. మన ఆత్మీయ స్మృతులను అభివృద్ధి పరచుకొను నిమిత్తము మనము కొన్ని ఉదాహరణలను ఇప్పుడు గమనించుదాం.

## ఇశ్రాయేలీయులు మరచారు

ఇశ్రాయేలీయులను దేవుడు ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించెనుగాని వారు త్వరలోనే ఆయనను మరచిపోయిరి. న్యాయాధిపతుల గ్రంథములో దేవుని ప్రజలు ఆయననుండి తరచు తొలగిపోయిన వృత్తాంతములను చదువగలము. వారి చరిత్ర ఈలాగున్నది: దేవుని ప్రజలు పాపము చేతురు, వారిని పీడించడానికి బాధించడానికి వారి చుట్టుప్రక్కల యున్న దేశస్థులను దేవుడు వారి మీదికి పంపించును. వారు విమోచనకు మొరపెట్టుదురు. వారిని విమోచించడానికి ఒక న్యాయాధిపతిని దేవుడు వారికి పంపించును. వారు విమోచింపబడుదురు. ఈ న్యాయాధిపతి చనిపోవును. దేవుని ప్రజలు మరల పాపము చేతురు. దేవుడు ఏర్పరచుకొనిన ఈ ప్రజలు ఒక్కొక్కసారి పశువులకు ఆహారధాన్యములు లేక బాధపడిరి. కొందరు గుహాలలో జీవించిరి. వారి చుట్టుప్రక్కలయున్న జనాంగములచే పీడింపబడుచు పాలింపబడిరి. ఎందువలన? వారి ఆత్మీయ స్మృతి కుంటుబడినందువలన. దేవుని విమోచనను, నీతిగల జీవితముయొక్క ఫలములను వారు త్వరలో మరచిపోయినందువలన. అంతేకాదు. తమ చుట్టుయున్న విగ్రహముల తట్టు తిరిగి పాపము చేసినందువలన దేవుడు వారిని శిక్షించుచు వచ్చెను. వారి సమస్యలను బైబిలు ఇట్లు సంగ్రహించుచున్నది: "ఇశ్రాయేలీయులుచుట్టునుండు తమ శత్రువుల చేతిలోనుండి తమ్మును విడిపించిన తమ దేవుడైన యెహోవాను జ్ఞాపకము చేసికొనకపోయిరి (న్యాయాధి 8 : 34).

## 3

# అపొస్తలులు మరచారు

యేసు ఏర్పరచుకొనిన అపొస్తలులుకూడ ఆయన యొక్క శక్తిని అతిత్వరలో మరచిపోవుచుండిరి. యేసు వెంట, ఆయన అపొస్తలుల వెంట ఒక గొప్ప జనసమూహము అరణ్య ప్రదేశమునకు వచ్చిరి. యేసు వారిమీద కనికరపడెను, అనేక సంగతులను బోధించెను; మరియు అయిదు రొట్టెలు రెండు చిన్న చేపలతో అయిదువేల మంది పురుషులుగల ఆ జనసమూహమునకు అద్భుతముగా ఆహారము పెట్టెను. (మార్కు 6 : 34-44). మరల కొన్ని రోజులకు ఒక గొప్ప జనసమూహము క్రీస్తును వెంబడించెను. నాలుగు వేలమంది పురుషులు గల ఈ జనసమూహము ఎంతవరకు ఆయనలో లీనమై పోయిరంటే ఆహారము లేకయే మూడు రోజులనుండి వారు ఆయనను వెంబడించుచుండిరి. మరల దేవుని కుమారుని శక్తి ప్రేమలు అద్భుతరీతిగా వారి అవుసరమును తీర్చెను. ఆయన శిష్యులయొద్ద ఏడు రొట్టెలు కొన్ని చిన్న చేపలుండెను, క్రీస్తు వాటిని ఆశీర్వదించి జనసమూహమునకు వడ్డించుడని చెప్పెను. "వారు భోజనముచేసి తృప్తిపొందిన మీదట మిగిలిన ముక్కలు ఏడు గంపలనిండ ఎత్తిరి" (మార్కు 8 : 1-9).

ఇదయిన తరువాత యేసు తన శిష్యులతో దోనె ఎక్కి అద్దరికి పోయెను. దోనెలో తన శిష్యులతో "ఆయన - చూచుకొనుడి; పరిసయ్యుల పులిసిన పిండిని గూర్చియు హేరోదు పులిసిన పిండిని గూర్చియు జాగ్రత్తపడుడని వారిని హెచ్చరించెను" (మార్కు 8:15). అబద్ధబోధను గూర్చిన ఈ హెచ్చరికను వారు అపార్థము చేసికొని వారియొద్ద రొట్టెలు లేవేయని ఆలోచించుకొనసాగిరి. యేసు అది యెరిగి మన యొద్ద రొట్టెలు లేవేయని మీరెందుకు ఆలోచించుకొనుచున్నారు? మీరింకను గ్రహింపలేదా? వివేచింపలేదా? ... ... నేను ఆ అయిదువేల మందికి అయిదు రొట్టెలు విరిచి పంచిపెట్టినది,

ఆ నాలుగువేలమందికి ఏడు రొట్టెలు నేను విరిచి పంచిపెట్టినది జ్ఞాపకములేదా? యని వారినడిగెను (మార్కు 8:18-20). ఈ భూమిమీద ఎన్నడు జరుగని రెండు ఆశ్చర్యకరమైన అద్భుతములను తిలకించిన తరువాత ఈ అపొస్తలులు తాము తినుటకు రొట్టెలు మరచిపోతిమే యని చింతింపసాగిరి. వారి జ్ఞాపకశక్తి అంతసంకుచితమైనది!

## హెబ్రీ క్రైస్తవులు మరచారు

హెబ్రీయులలోనుండి క్రైస్తవులయినవారు తాము హింసలను ఎదుర్కొనిరను సంగతిని త్వరలో మరచిపోయిరి. యూదా మతములో నుండి లేక యూదులలోనుండి క్రైస్తవులైనవారికి హెబ్రీ పత్రిక వ్రాయబడెను. వారికి కలుగుచున్న హింసలు ఘోరముగా యుండెను. క్రైస్తవులైనవారు మతద్రోహులు, దేశద్రోహులుగా ఎంచబడిరి. ఈ హింసలనుండి తప్పించుకొనుటకుగాను తిరిగి యూదా మతములో చేరిపోవాలనే శోధన ఎక్కువగాయున్న సమయములో పరిశుద్ధాత్ముడు ఈ హెబ్రీ క్రైస్తవులకు ఒక పత్రికను వ్రాయించెను. ఒక్కొక్కసారి కఠినముగాను, ఒక్కొక్కసారి మృదువుగాను ఉన్న ఈ పత్రిక వారిని ప్రోత్సహించుటకు బలముగా పనిచేసెను. దేవుని బిడ్డలు తాము ఏర్పరచుకొనిన మార్గములో నిలచి యుండుటకు సహాయము చేసెను.

సంఘము స్థాపించబడిన మూడు శతాబ్దములలోనే ఈ హెబ్రీ సోదరులు తమ ఘనతను మరచిపోయిరి. ఘోరమైన హింసలు కలుగుచుండగా స్తెఫను, యాకోబులవంటి సభ్యులు విశ్వాస ధైర్యములతో ఎట్లు నిలబడిరో వారు మరచిపోయిరి. వారిని ప్రోత్సహించుటకుగాను పరిశుద్ధాత్ముడు ఇట్లు లిఖించెను. : "అయితే మీరు వెలిగింపబడిన మీదట శ్రమలతోకూడిన గొప్ప పోరాటము సహించిన పూర్వపు దినములు జ్ఞాపకము తెచ్చుకొనుడి. ఒక విధముగా చూచితే మీరు నిందలను బాధలను అనుభవించుటచేత పదిమందిలో ఆరడిపడితిరి;

మరియొక విధముగా చూచితే వాటిననుభవించిన వారితో పాలివార లైతిరి..... కాబట్టి మీ ధైర్యమును విడిచిపెట్టకుడి; దానికి ప్రతి ఫలముగా గొప్ప బహుమానము కలుగును" (హెబ్రీ 10:32-35).

దేవుని ప్రేమను మరచినయెడల మన విశ్వాసము కుంటుబడును. మనశ్శాంతి కలుగకపోవును, చివరకు సత్యమునుండి దూరమై పోవుదుము. అయితే దేవుని కృపగల హస్తము మన జీవితమును నడిపించు విధానమును జ్ఞాపకముంచుకొనుటద్వారా శక్తివంతమైన విశ్వాసము మనదగును. మొదటిగా ఒక తీవ్రమైన సమస్యను మనము ఎదుర్కొనుచున్నప్పుడు అంతకు ముందున్న సమస్యలో దేవుడు ఎట్టి సహాయము చేసెనో జ్ఞాపకము చేసికొందము. "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని" తెలిసికొందము (రోమా 8:28). రెండవదిగా మనము శోధనల నెదుర్కొనుచున్నప్పుడు మనము పిలువబడిన పిలుపును జ్ఞాపకము చేసికొందము. మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందకముందు నిరీక్షణ లేనివారును లోకమందు దేవుడు లేనివారుగా యున్నామని జ్ఞాపకముంచుకొందము (ఎఫెసీ 2 : 12). అయితే ఈ పరిస్థితి మార్చబడినది. మునుపు దూరస్థులైన మనము క్రీస్తు యేసునందు, క్రీస్తు రక్తమువలన సమీపస్థులమైతిమి (2 : 13). అందువలన మనము దేవుని కుమారుని రక్తమువలన కడుగబడిన దేవుని బిడ్డలము. విశ్వాస పరీక్షలలో మనము దేవుని సహాయమువలన నిలబడగలమని గ్రహించుచు, అపొ. పౌలువలె "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" అని చెప్పగలము (ఫిలిప్పీ 4 : 13).

## జ్ఞాపక చిహ్నములు

క్రైస్తవులు క్రీస్తు యేసునందలి తమ విశ్వాసములో వెనుకబడకుండు నిమిత్తము లోకాన్ని రక్షించుటకు దేవుడు తన కుమారుని

ద్వారా చేసిన గొప్పత్యాగమును జ్ఞాపకముంచుకొను నిమిత్తము, క్రీస్తు తన రాజ్యమైన సంఘములో ప్రభు రాత్రి భోజనమునిచ్చెను. "ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రియొక రొట్టెను ఎత్తుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి యిది మీకొరకైన నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని యీ పాత్ర నా రక్తమువలనైన క్రొత్త నిబంధన; మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను" ( 1 కొరింథి 11 : 23-25). మన జ్ఞాపకశక్తి సంకుచితమైనదని ప్రభువుకు తెలుసు. అందువలననే క్రైస్తవులు ఆరాధనకు కూడి వచ్చినపుడు ప్రతి ఆదివారము ప్రభు రాత్రిభోజనములో పాలు పొందుట ద్వారా మనకై నలుగగొట్టబడి, చిందింపబడిన ఆ పవిత్ర శరీర రక్తములను జ్ఞాపకము చేసికొనవలెనని ఆయన కోరుచున్నాడు. నీ వాయనను ఎంత తరచు జ్ఞాపకము చేసికొనుచున్నావు ?

క్రీస్తు యేసునందలి విశ్వాసముద్వారా శోధనలను జయించగోరుచున్న యెడల, పాప విముక్తి పొందగోరుచున్న యెడల ఆయనే దేవుని కుమారుడని విశ్వసించండి, మీ పాపముల నిమిత్తము మారుమనస్సు పొందండి, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొనుచు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందండి ! ప్రభువును జ్ఞాపకముంచుకొనుచూ ఆయన కృపలో పెరగండి ! !

---

## శో ధ న (Temptation)

శోధన అనగా పరీక్షించుట, లేక పరిశోధించుట అని అర్థము. శోధనలకు గురికాని మానవు లెవరునూ లేరు. మనకు శోధనలు కల్గుట సహజము. మానవుని జీవితములో కలిగే శోధనలు అతని భవిష్యత్ జీవితమును బలపరచుటకు ఔషదము వంటిది. అందుకే ఓ ఆంగ్ల కవి

ఇలా అన్నాడు. "Life is not a bed of roses". జీవితము పూలపాన్పు కాదని. మనకు శోధనలు కల్గునపుడు నిరుత్సాహపడకుండా ధైర్యముగా ముందుకు సాగాలి. ఎదురుగాలిలోనే గాలిపటం బాగా ఎగురుతుంది. అదే విధముగా మనకు ఎదురయ్యే శోధనను మహానందముగా యెంచుకొనవలెనని దేవుని వాక్కు చెప్పుచున్నది. "మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుకొనుడి" (యాకోబు 1:2; 1 పేతురు 4:12-13).

## దేవుడు మానవుల విధేయతను పరిశోధించును

ఇస్సాకును బలియర్పించుమని అడుగుటద్వారా దేవుడు విశ్వాసమునకు కర్తయైన అబ్రహామును పరిశోధించెను (ఆది 22:1). దేవుని మహా కృప చొప్పున ఐగుప్తు కబంధ హస్తములనుండి విడిపించబడి మోషే వంటి ఉత్తమ నాయకుని సారథ్యంలో నడిపించబడుచున్న ఇశ్రాయేలీయుల విశ్వాసమును దేవుడు పరీక్షించెను. ఎట్లనగా యెహోవా మోషేను చూచి - ఇదిగో నేను ఆకాశమునుండి మీ కొరకు ఆహారమును కురిపించెదను; వారు నా ధర్మశాస్త్రము ననుసరించి నడుతురో లేదో అని నేను వారిని పరీక్షించునట్లు ఈ ప్రజలు వెళ్ళి ఏనాటి బత్తెము ఆనాడే కూర్చుకొనవలెను (నిర్గమ 16:4; ద్వితీ 8:2).

ఉపాధ్యాయుడు విద్యార్థుల మేధస్సును, తెలివితేటలను, ఆసక్తిని పరీక్షించునట్లుగా దేవుడు మనలను శోధించును. ఆయనపట్ల మనకున్న ప్రేమ పరిపూర్ణము చెందవలెనని శోధించును. "ఏలయనగా మీరు మీ దేవుడైన యెహోవాను మీ పూర్ణ హృదయముతోను మీ పూర్ణ ఆత్మతోను ప్రేమించుచున్నారో లేదో తెలుసుకొనుటకు మీ దేవుడైన యెహోవా మిమ్మును పరీక్షించుచున్నాడు అని దైవగ్రంథము హితవు చెబుతున్నది (ద్వితీ13.3. న్యాయాధి 2:19-22, 3:4).

అందుచేత భక్తుడైన దావీదు ఇట్లు పలికెను: "యెహోవా, నన్ను పరిశీలించుము, నన్ను పరీక్షించుము, నా అంతరింద్రియములను నా హృదయమును పరిశోధించుము" (కీర్తన 26 : 2). అపొస్తలుడైన పౌలు శోధనను గూర్చి ఇట్లనుచున్నాడు. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు. మీరు సహింప గలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథి 10 : 13).

దేవుని వాగ్దానములను మనుష్యులు నమ్మక ఆయనను పరీక్షించుటయే శోధన. "ఐగుప్తులోను అరణ్యములోను దేవుని సూచక క్రియలను, మహిమను చూచిన ఇశ్రాయేలు ప్రజలు ఆయనను శోధించుటవలన వాగ్దాన భూమిలో ప్రవేశించె అధికారమును కోల్పోయిరి" (సంఖ్యా 14 : 22-25; కీర్తన 95 : 9).

## అపవాది శోధించును

పాపమును చేయించుటకు మనలను సాతాను శోధించును. ఆది మానవులైన ఆదాము, హవ్వలకు అసత్యమైన తప్పుడు వాగ్దానములను యిచ్చి దేవుని ఆజ్ఞలను మీరి ఆత్మీయ మరణమును పొందుటకు ప్రేరేపించి సాతాను వారిని శోధించెను (ఆది 3 అధ్యాయము). సర్వలోకాధిపతియైన క్రీస్తును సాతాను శోధించి విఫలుడై వెనుదిరిగెను. (మత్త 4 : 1-12). "క్రీస్తు శోధింపబడి శ్రమ పొందెను కనుక శోధింపబడువారికిని సహాయము చేయగలవాడై యున్నాడు (హెబ్రీ 2 : 18). "శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును. దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని

శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరలు కొల్పబడినవాడై శోధింపబడును." (యాకోబు 1 : 12-14, 1 పేతురు 1 : 5-7).

కనుక ప్రియ సహోదరి, సహోదరా నీవు నీ ఇంటివారివలన నీ భార్యాబిడ్డలవలన, అవిశ్వాసులైన వారివలన, సహచరులవలన కలుగు శోధనను జయించుటకు విశ్వాస సహితమైన ప్రార్థన చేయుము (లూకా 22 : 40, మత్తయి 6 : 13).

ఒకవేళ నీవు ఇంకనూ క్రైస్తవుడవు కానియెడల, శోధనను జయించవలెనన్న క్రీస్తు వాక్యం విని (రోమా 10 : 17), విశ్వసించి (యోహా 2 : 36), మారుమనస్సు పొంది (అపొ. కా. 17 : 30) యేసు నీ రక్షకుడని నీ నోటితో ఒప్పుకొని (రోమా 10 : 9) పాపక్షమాపణ నిమిత్తము వాక్యానుసారమైన బాప్తిస్మముపొంది (అపొ. కా. 2:38) ఆయన నిర్మించిన సంఘములో సభ్యుడవు కమ్ము (మత్తయి 16 : 18, 1 కొరింధి 3 : 11, కొలస్స 1 : 16, ఎఫెసీ 1 : 22-23). అప్పుడు నీవు నేనూ తప్పక శోధనలను జయింతుము. "సమస్తమును పరీక్షించి మేలైనదానిని చేపట్టుడి. ప్రతి విధమైన కీడునకును దూరముగా ఉండుడి (1 థెస్స 5 : 21).

— పి, చంద్రశేఖర్, క్రీస్తుసంఘం, ధవళేశ్వరం.

## యేసుపై నేరస్థాపన సాధ్యమా ?

## Is it Possible to Blame Jesus ?

న్యాయపీఠముపై ఆసీనుడైన పిలాతు ఎదుట దోషిగా నిలబెట్టబడిన ఈయన ఎవరో కాదు. సాక్షాత్తు దేవుని కుమారుడైన యేసు క్రీస్తే. ఆయనపై ఎన్నో నేరాలు మోపబడ్డాయి. యూదులు "ఆయ

నకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదకుచుండిరి కాని అబద్ధ సాక్షు లనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరకలేదు. తుదకు ఇద్దరు మనుష్యులు వచ్చి - వీడు దేవాలయమును పడగొట్టి, మూడు దినము లలో దానిని కట్టగలనని చెప్పెననిరి" (మత్త 26:59-61).

"పిలాతు నీ మీద వీరెన్ని నేరములు మోపుచున్నారో నీవు విన లేదా? అని ఆయనను అడిగెను" (మత్త 27 : 13). ఈయనపై మానవులు ఆనాడు ఈనాడు నేరాలు మోపుచునే యున్నారు. వారు అసూయ చేత ఆయనను అప్పగించిరని పిలాతు ఎరిగి యుండెను (మత్త 27 : 18). యేసును జనసమూహములు వెంబడించుట చూచి, ఆయన ఆశ్చర్యకరమైన బోధలు విని ఆనాటి ప్రధాన యాజకులు పెద్దలు, శాస్త్రులు అసూయపడిరి.

ఆధునికులు యేసుపై నేరస్థాపన చేయుటలో ఆనాటి పెద్దలు, ప్రధాన యాజకులు శాస్త్రులకంటె ఒక అడుగు ముందుకు వేసారు. ఆయనకు మాలిన్యం అంటించే వ్యర్థప్రయత్నంలో ఆయనపై నిరాధారమైన కట్టు కథలను వ్రాసి చలన చిత్రాలు నిర్మించడం జరిగింది. వీరిప్రయత్నం ఒక మానవుడు ఉప్పెనను ఆపడం కొఱకు తన చేతిని అడ్డంపెట్టినట్లుగా ఉన్నది. ఎందరో విమర్శకులు మట్టి పాలయ్యారు. ఆయన పరిశుద్ధత పరిమళ వాసనగా వెదజల్లుచున్నది. ఆయన మార్గము ప్రపంచ నలుమూలల ప్రతిధ్వనించుచున్నది.

యేసు జీవితాన్ని ఆనాటి విమర్శకులు జాగ్రత్తగా గమనించారు. ఆయనపై నేరం మోపడానికి కొన్ని ప్రశ్నలు వేసారు. ఆయన వాటికి సమాధానం చెప్పిన తరువాత ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు (మత్త 22 : 46).

ప్రాథమిక స్థాయిలోనే పాపాన్ని తుంచివేయ గలిగిన బోధలు యేసుక్రీస్తు బోధలు. ఆయన ఈలాగున బోధించాడు : "వ్యభిచారము

చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా! నేను మీతో చెప్పున దేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. నీ కుడి కన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల దాని పెరికి నీ యొద్ద నుండి పారవేయుము" (మత్త 5 : 27-29).

పాపాన్ని ఈ విధంగా ప్రాథమిక స్థాయిలోనే పెరికి వేయగల పరిశుద్ధుని బోధలలోను ఆయన జీవితంలోను ఎట్టి నేరస్థాపన ఈ మానవులు చేయగలరు? నిరాధారమైన ఆరోపణలు యేసుక్రీస్తు పరిశుద్ధతకు ఎట్టి భంగాన్ని కలిగించలేవు.

ఇదిగో యేసయ్య యూదుల మధ్య చేసిన సవాలు, వినండి "నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" (యోహా 8:46)

యేసు ప్రభువని నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొంది పరిశుద్ధులమైన మనము మనలోనున్న నిరీక్షణను గూర్చి మనలను హేతువడుగు ప్రతివానికి సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి మన హృదయమందు ఆయనను ప్రభువుగా ప్రతిష్ఠించుకోవాలి (1 పేతురు 3 : 15-16).

"—నేను నిరపరాధ రక్తమును (నీతిమంతుని రక్తమును) అప్పగించి పాపము చేసితినని" ఆయనను అప్పగించిన యూదా చెప్పెను (మత్త 27 : 4).

ప్రభువైన యేసుక్రీస్తు జీవించిన పరిశుద్ధ జీవితం ఆయన మాదిరి ప్రపంచ చరిత్రలో ఆయన తప్ప ఎవరూ జీవించ లేనిది. హింసలకు ఎదురు నిలిచి శ్రమలలో మరింత బలాన్ని పుంజుకొని విస్తరించిన ఉత్తమమైన, మేలైన మార్గాన్ని అడ్డగించ గలవాడెవడు? ఆయన మార్గంలో నుండి ఆయన కొరకు తమ ప్రాణాల్ని సైతం లెక్క చేయని హతసాక్షుల త్యాగం వ్యర్థమా?

"క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపువాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా?" రోమా 8 : 35.

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

## క్రీస్తును గూర్చి ఆయన సంఘమును గూర్చి నేనెట్లు ప్రజలకు తెలియజేయగలను?

## (How Can I Tell People About Jesus And His Church)

ఈ ప్రశ్నకు జవాబిచ్చేముందు మనం స్వపరీక్ష నిమిత్తమై కొన్ని ప్రశ్నలు వేసికొనవలసి యున్నది.

మనం యేసును గూర్చి, ఆయన రక్షణ సంకల్పాన్ని గూర్చి ఆయన సంఘాన్ని గూర్చి ఎంతవరకు తెలిసికొన్నాం? ఒక వ్యాపారి తను అమ్మే సరకును గూర్చి బాగా తెలిసికొనక పోయినట్లయితే అతడు వాటిని గూర్చి ఇతరులకు తెలియజేయలేడు. క్రీస్తు ఎవరో మనకు తెలియకుండ ఆయనను గూర్చి మనం తెలియజేయలేము. యేసు గురించి మనం ఎట్లు తెలిసికొనగలం? వాక్యాన్ని పఠించి దానిని మన జీవితాలకు అన్వయించుకొన్నప్పుడు మాత్రమే కదా! మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానము నందును మనమెట్లు అభివృద్ధి పొందగలమో (2 పేతురు 3:18) మనకు తెలియజేయుచున్నది. "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమో 2:15).

ఈ జ్ఞానమునందు మనము అభివృద్ధి పొందుటకు మనం చేయవలసినదేమి? "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్న

యెడల అతడు దేవుని అడుగవలెను. అప్పుడది అతనికి అనుగ్రహింప బడును" (యాకోబు 1:5).

మనమెట్టి జీవితాన్ని జీవించుచున్నాము? మనం క్రైస్తవుల వలె జీవించుచున్నామా? లేక లోకరీతిలో జీవించుచు ప్రజలకు కనపడుచున్నామా? ప్రజలు మనలను గమనించడం మాత్రమే కాదు. వాడెంతటి జ్ఞానము కలవాడైనను అతడు వేషధారి యైతే వాడి మాట వారు వినరు.

జీవితాన్ని గురించి మన ఉద్దేశ్యమేమై యున్నది? శ్రమలలో మనం ఆనందించగలిగిన స్థితిలో ఉన్నామా? మనం ఎల్లప్పుడు ఆనందించవలసిన వారమై యున్నాము (ఫిలిప్పీ 4:4). పౌలు సీలలు చెరసాలలో నుండి స్తోత్ర గీతములు పాడిరి (అపొ. కా. 16:25). శ్రమలలో ఉన్నప్పుడు మనం కొన్నిసార్లు స్తోత్రగీతములు పాడలేము. క్రైస్తవ జీవితము అన్నిటికంటె గొప్ప జీవితము. మనం ఎట్టివారమో ప్రజలు తెలిసికొనగలుగునట్లు ఎల్లప్పుడు ఆనందించేవారముగా ఉందాం.

నశించిన వారియెడల మన ఉద్దేశ్య మేమైయున్నది? "నీకన్న నేను పరిశుద్ధుడను" ("Holier Than Thou") అను ఉద్దేశ్యం గాని మనకున్నదా? మనం నమ్మినట్లు వారు నమ్మనియెడల నరకానికి వెళ్ళుదురని తెలియజేయుచున్నామా? ఈ స్థితిలోనే వారుండాలని మనం భావించక వారిపై నిజమైన ప్రేమను, జాగ్రత్తను మరియు వారియెడల ఆసక్తిని కలిగియుండాలి.

చివరిది ముఖ్యమైనది ఏదనగా, నశించిన ఆత్మలయొద్దకు వెళ్ళి, తెరువబడిన ద్వారములకొరకు అనగా సువార్త ప్రకటించే అవకాశముల కొరకు మనం ఆశతో ఎదురుచూచుచున్నామా? క్రీస్తునందలి మన జ్ఞానము విషయములోను, ఆయనలో మనము జీవించుచున్న

మార్గాన్ని బట్టి మనలో యేసును ప్రజలు చూడగలుగుతారు. మనకు వచ్చే గొప్ప తరుణాలను ఆధారంగా చేసికొని యేసునుగూర్చి ఆయన సంఘాన్ని గూర్చి తెలియజేయగలము.

—డోరతి ఫిస్కస్.

## దుర్బోధ(కు)లకు దూరముగా ఉండుడి

ప్రియులారా! మన కందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తి గలవాడనై ప్రయత్నించుచుండగా పరిశుద్ధులకు ఒక్కసారి అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను. ఏలయనగా కొందరు రహస్యముగా జొరబడియున్నారు. వారు భక్తిహీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగపరచుచు మన అద్వితీయ నాధుడును ప్రభువునైన యేసుక్రీస్తును విసర్జించుచున్నారు (యూదా 1 : 3-4).

మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలె మనలోను అబద్ధ బోధకులుందురు. వీరు తమ్మును కొనిన (1 పేతురు 1:18, 1 కొరింథి 7 : 23) ప్రభువును కూడా విసర్జించుచు తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసుకొనుచు నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధింతురు. మరియు అనేకులు వారి పోకిరి చేష్టలను అనుసరించి నడతురు. వీరినిబట్టి సత్యమార్గము దూషింపబడును. వారు అధికలోభులై కల్పనా వాక్యములు చెప్పుచు మీవలన లాభము సంపాదించుకొందురు (2 పేతురు 2 : 1-3).

అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొఱ్ఱె చర్మమును ధరించుకొని మీ యొద్దకు వత్తురు. గాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు. వారి ఫలమువలన మీరు వారిని తెలిసికొందురు.

ప్రతి మంచిచెట్టు మంచి ఫలములు ఫలించును (గలతీ 5 : 22). పనికి మాలిన చెట్టు కాని ఫలములు (గలతీ 5 : 19-21) ఫలించును (మత్తయి 7 : 15-17). వారు మీ మేలు కోరి మిమ్మును ఆసక్తితో వెంటాడు వారు కారు మీరే తమ్మును వెంటాడవలెనని మిమ్మును బయటకి త్రోసివేయ గోరుచున్నారు (గలతీ 4 : 13). వారు ఒకనిని తమ మత ములో కలుపుకొనుటకు సముద్రమును భూమిని చుట్టి వచ్చెదరు. అతడు కలిసినప్పుడు తమకంటె రెండంతలు నరక పాత్రునిగా చేయు దురు (మత్తయి 23 : 15).

అబద్ధ బోధకులు వ్యర్థమైన డంబపు మాటలు పలుకుచు తామే శరీరసంబంధమైన దురాశలు గలవారై, తప్పుడు మార్గమందు నడచు వారిలోనుండి అప్పుడే తప్పించుకొనిన వారిని పోకిరి చేష్టలచేత మరులు కొల్పుచున్నారు. తామే భ్రష్టత్వమునకు దాసులైయుండియు అట్టి వారికి స్వాతంత్ర్యము ఇత్తుమని చెప్పుదురు (II పేతురు 2 : 18).

చిన్న పిల్లలారా! ఇది కడవరి గడియ క్రీస్తు విరోధి వచ్చునని వింటిరి గదా. ఇప్పుడును అనేకులైన క్రీస్తు విరోధులు బయలుదేరి యున్నారు. ఇది కడవరి ఘడియ అని దీనిచేత తెలిసికొనుచున్నాము. వారు మనలోనుండి బయలు వెళ్లిరిగాని వారు మన సంబంధులు కారు (1 యోహాను 2 : 18-19). సహోదరులారా అపొస్తలులు చెప్పిన బోధ ప్రకారము కాక అక్రమముగా నడచుకొను ప్రతి సహోదరుని యొద్ద నుండి తొలగిపోవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మీకు ఆజ్ఞాపించుచున్నాను.

అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి మనుష్యుల మాయోపాయముచేత వంచనతోను తప్పుమార్గమునకు లాగు కుయుక్తి తోను గాలికి కొట్టుకొనిపోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగరగొట్టబడిన వారమై

నట్లుండక ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదము (ఎఫెసీ 4:14-15). అపొస్తలులు ప్రకటించు సువార్త గాక మరియొక సువార్తను మేమైనను, ఎవరైనను, పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక (గలతీ 1:8).

మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. ఏ ఉపదేశ రూపకముగా సువార్త మనకు ప్రకటింపబడినదో అ ఉపదేశమును మనము గట్టిగా పట్టుకొని యున్నయెడల ఆ సువార్త వలననే మనము రక్షణ పొందువారమై యుందుము. అదేమనగా లేఖనము ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. లేఖనము ప్రకారము మూడవ దినమున లేపబడెను (1 కొరింథి 15:1-5). యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు (రోమా 10:9).

తొట్రిల్లకుండ మనలను కాపాడుటకును తన మహిమ యెదుట ఆనందముతో మనలను నిర్దోషులునుగా నిలువబెట్టుటకును శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మహిమయు మహాత్మ్యమును ఆధిపత్యమును అధికారమును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వయుగములును కలుగును గాక, ఆమెన్ (యూదా 1:24-25).

సహోదరులారా, మాకొరకు ప్రార్థన చేయుడి (1 థెస్స లోని 5 : 25).

—V. జగన్నాథరావ్, గాంధీనగర్, విజయనగరం

# పది ఆజ్ఞలనుగూర్చిన కొన్ని అపోహలు

## (Some Misconceptions about Ten Commandments)

బైబిలులో పాత నిబంధనలో కనబడే పది యాజ్ఞలను దేవుడే మొదట నోటితో చెప్పి తరువాత రాతి పలకలమీద వ్రాసి యిచ్చాడు. అయితే పది యాజ్ఞలను గూర్చిన అపోహలు అనేకము లున్నాయి. అందువలన అనేక అసత్య సిద్ధాంతా లుద్భవించాయి. పది యాజ్ఞలకు మన జీవితంలో కలిగిన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలంటే వాటిని గూర్చి వివరంగా మనము తెలిసికొని యుండాలి.

మొదటిగా, సబ్బాతు దినమును పరిశుద్ధముగా ఆచరించవలెననే యాజ్ఞ తప్ప మిగిలిన తొమ్మిది యాజ్ఞలలోని సూత్రాలు నిజానికి క్రొత్తవేమీ కాదు. పది ఆజ్ఞలు ఇయ్యబడక ముందునుండే, నిజానికి మానవుడు సృష్టింపబడిన నాటినుండే నరహత్య చేయుట పాపము. కయీను, హేబెలుల కథ దీనికి తార్కాణము (ఆది 4:2-5). ఆలాగే వ్యభిచరించుట కూడ ఆదినుండి పాపమే. యోసేపు పోతీఫరు భార్యతో వ్యభిచరించుట పాపమని యెరిగియే ఆమెనుండి పారిపోయాడు. ఇది పది యాజ్ఞలు ఇయ్యబడక ముందుజరిగిన సంఘటనే. అట్లే ఆది కాండము 20వ అధ్యాయములో అబ్రాహాము తన భార్యయైన శారాను గూర్చి అబీమెలెకు దగ్గర అబద్ధమాడిన సంఘటనలో అబద్ధ మాడుట ఆదినుండి పాపమే యని మనము గ్రహించుకోగలము.

## అందరికీ కాదు

తరువాత ఈ పది యాజ్ఞలు గల ధర్మశాస్త్రము అన్ని జనాంగముల వారికి ఇయ్యబడినదని, అది అందరికి వర్తిస్తాదని చాలమంది తలుస్తారు, గాని అది అట్లు కాదు. ఈ సందర్భంగా ద్వితీ 5 : 2, 3 వచనముల నొకసారి చదువుదాం. మోషే ఇశ్రాయేలీయుల నందరిని

పిలిపించి ఇట్లనెను: "మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా, మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే యీ నిబంధన చేసెను." గనుక పాత నిబంధన దేవునికిని యూదులకును మధ్య జరిగిన ఒక ఒప్పందమని మనము గ్రహించాలి. ఇశ్రాయేలీయులు కాని వారందరు ఈ నిబంధన నుండి వేరుచేయబడ్డారు. అయితే యూదులు కాని అన్యులు తమ మన స్సాక్షినిబట్టి జీవించులాగున దేవుడు వారికి కలుగజేసాడు. రోమా 2:14, 15లో అపో. పౌలు ఇట్లనుచున్నాడు: "ధర్మశాస్త్రములేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసిన యెడల వారు ధర్మశాస్త్రము లేనివారైనను తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనసాక్షి కూడ సాక్ష్యమిచ్చు చుండగను వారితలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్ర సారము తమ హృదయముల యందు వ్రాయబడినట్టు చూపుచున్నారు."

## రెండు భాగాలు కాదు

తరువాత, మోషే ధర్మశాస్త్రము నైతిక చట్టము, సంస్కార చట్టములను (Moral Law & Ceremonial law) రెండు భాగాలుగా చేయబడలేదని మనము గ్రహించాలి. పది యాజ్ఞలకును మోషే ధర్మశాస్త్రములో మిగిలిన ఆజ్ఞలకును ఏదైనా భేదమున్నట్లు మన కేవిధంగాను కన్పడదు. పది యాజ్ఞలు నిబంధన వాక్యములని నిర్గమ 34:28లో చెప్పబడినది; మిగతా ఆజ్ఞలన్నియు నిబంధన గ్రంథమని నిర్గమ 24:7లో చెప్పబడినది. పదియాజ్ఞలు నిబంధన మందసములో ఉంచబడగా మిగిలిన ధర్మశాస్త్ర గ్రంథమంతయు నిబంధన మందసము ప్రక్కన ఉంచబడేది (ద్వితీ 31 : 26).

దేవుడు సంస్కార చట్టాన్ని (Ceremonial Law) మాత్రమే సిలువకు మేకులతో కొట్టి వేసాడుగాని పదియాజ్ఞలు గల నైతిక

చట్టాన్ని కాదని కొందరు చెబుతుంటారు. అయితే కొలస్స 2 : 14లో అపొ. పౌలు, "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను, మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెనని" చెప్పుచున్నాడు. "కాబట్టి అన్న పానముల విషయములలోనైనను పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయములోనైనను మీకు తీర్పుతీర్చ నెవనికిని అవకాశ మియ్యకుడి. ఇవి రాబోవు వాటి ఛాయయేగాని నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది" అని అతడు 17వ వచనములో చెప్పాడు. ఈ వచనములు మోషే ధర్మశాస్త్ర మంతయు క్రీస్తులో కొట్టివేయబడెనని బోధించుచున్నవి. 2 కొరింథీ 3 : 14 ఇట్లు చెప్పుచున్నది: "మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాత నిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలచియున్నది." వాక్యము ఇంతకంటే యేమి విపులముగా యుండగలదు? ధర్మశాస్త్ర మంతయు క్రీస్తునందు కొట్టివేయబడినది.

## ఇంకా అనేక నైతిక సూత్రాలు

పది ఆజ్ఞలలో లేని నైతిక సూత్రములు చాల యున్నాయని మనం గమనించాలి. ఉదాహరణకు, "దుష్కార్యము చేయుటకై సమూహమును వెంబడించవద్దు. న్యాయమును త్రిప్పివేయుటకు సమూహముతో చేరి వ్యాజ్యములో సాక్ష్యము పలుకకూడదు. వ్యాజ్యమాడువాడు బీదవాడైనను వానియెడల పక్షపాతముగా నుండకూడదని" నిర్గమ 23:2లో వ్రాయబడియున్నది. యిది పది ఆజ్ఞలలో ఒకటి కాకపోయినా, దానిలో యున్న నైతిక సూత్రము వాటియంత బలముగలదే. నిజానికి 10 ఆజ్ఞలలో సబ్బాతును గూర్చిన ఆజ్ఞ చాల మట్టుకు సంస్కార సంబంధమైనదే.

పాత నిబంధన ననుసరిస్తూ పది ఆజ్ఞలను పాటిస్తాయుంటే మనము రక్షించబడుదుమని కొందరు తలుస్తారు. గాని అట్లుకాదు! బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (గలతీ 2:21). మానవులను రక్షించు నిమిత్తము పాతనిబంధన ఏర్పాటు చేయబడలేదు గాని, "మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను" (గలతీ 3:24). మనము ధర్మశాస్త్రము వలన గాక విశ్వాసమువలన నీతిమంతులముగా తీర్చబడుదుము. యూదుల అతిక్రమము వలన వారికి ధర్మశాస్త్ర మీయబడెను. పాపముయొక్క ఘోర దుష్టత్వాన్ని వారు తెలుసుకొనునట్లును, వారి పాపమును అరికట్టుటకును ధర్మశాస్త్రము ఈయబడెను.

## సువార్తకు లోబడాలి

పది యాజ్ఞలు పాటించుటద్వారా మానవుడు నైతికంగా సద్వర్తనుడవుతాడు గాని, పాపమునుండి రక్షించబడాలంటే పది ఆజ్ఞలకన్నా ఎక్కువ మానవునికి అవుసరం. క్రైస్తవు లందరు నైతికంగా మంచివారే, గాని నైతికంగా ఈ లోకంలో యున్న మంచి వారందరు క్రైస్తవులు కారు. ఒకడు పది యాజ్ఞలు పాటిస్తూ క్రైస్తవుడు కాకపోవచ్చును. నైతికంగా సద్వర్తనులైన అనేకులను యితర మతాలలో మనము చూస్తున్నాము గదా. అయితే క్రీస్తు సువార్తను నమ్మి దానికి లోబడినవాడే క్రైస్తవుడు. క్రీస్తునందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవాడు క్రైస్తవుడు. అతడు క్రీస్తుతో ఆయన సంఘములో చేర్చబడినవాడు. ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధిస్తూ క్రీస్తు నియమములను పాటించువాడు క్రైస్తవుడు.

యేసుక్రీస్తు ధర్మశాస్త్రాన్ని కొట్టివేయుటకు వచ్చాడనుకొనడం మరొక పొరబాటు. ఆయన దాన్ని నాశనం చేయడానికి గాక నెరవేర్చుటకు వచ్చాడు. ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంధముల లోను ఏదైతే చెప్పబడిందో దాని యంతటి నెరవేర్పు యేసుక్రీస్తు (మత్తి 5 : 17). వాటిని నెరవేర్చుటద్వారా ఆయన పాత ధర్మశాస్త్రము యొక్క విలువకిని అంతమొందించాడు. దాని స్థానములో దానికంటె శ్రేష్టమైన దాన్ని ఆయన ప్రవేశపెట్టాడు. "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1 : 17).

పాతనిబంధన యొక్క విలువ మనపై యేమీ లేకపోయినను, దానిని మనం చదవాలి. అది దేవుని వాక్యము. దానిలోని సంగతులు "దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడ్డాయి" (1 కొరింధీ 10 : 11). పాత నిబంధన చదువుట ద్వారా క్రొత్తనిబంధనలో బయల్పరచబడిన క్రీస్తు నొద్దకు మీరు చేరుదురనియే నా నిరీక్షణ.

— జాషువా గూటం.

---

## బైబిలు ప్రశ్నోపనిషత్

తల్లి లేకుండానే వచ్చి
తరువులా వర్ధిల్లి —
తనువులు చాలించిన
తల్లిదండ్రు లెవ్వరు ? = ఆదికాండము 5 : 1-5.

బ్రతికిన కాలమంతా
భక్తిగా జీవించారు — ఆది 5 : 21-24
మరణపు వాసన లేకుండా — హెబ్రీ 11 : 5
పరలోకం వెళ్లిన దెవ్వరు ? — II రాజులు 2 : 1-11.

తోలుదట్టి రోమవస్త్రం ధరించి
తేనె, మిడుతలు తినేవాడు　　మలాకీ 4:5-6, లూకా 1:14-17.
నీళ్లల్లో బాప్తిస్మ మిచ్చినవాడు　　మత్తయి 3.1-6, మార్కు 1:1-8
అతడే "ఏలియా" అనబడినవెవ్వరు?　　మత్తయి 11 : 7-15, 17 : 10-13..

యేసేక్రీస్తని ప్రకటిస్తూ
రాళ్ల దెబ్బలు తిని చస్తూ
పగతుల మన్నింపుమని
ప్రార్థించిన పరిశుద్ధు డెవ్వరు ?　　అపొ. కా. 6-7.

ఆసక్తితో వాక్యము నంగీకరించి
ప్రతిదినం లేఖనములు పరిశీలించారు
వీరు - వారికంటే ఘనులని ప్రశంస
లందిన ప్రథమ క్రైస్తవు లెవ్వరు?　　అపొ. కా. 17 : 10-12.

పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన
బోధనిమిత్తం పోరాడవలెనని పత్రిక
వ్రాసి పరిశుద్ధాత్మలో ప్రార్థించుచు
కనిపెట్టుచుండు దైవప్రేమలో　　క్రొత్త నిబంధనలో
నిలిచియుండాలనిన క్రీస్తు దాసుడెవ్వరు?　　26 పుస్తకము చూడండి.

భార్యాబిడ్డల బంధకము లున్నప్పటికిని
భక్తి ప్రవర్తులే అతడికి మిన్న　　ఆది. 6, 7, 8, అధ్యా.
ఆతరంలో నీతిమంతుడై రక్షింపబడి;　　హెబ్రీ 11 : 7.
ఈతరం వారికి ఎట్టి సందేశమిస్తున్నాడు?　　1 పేతురు 3 : 20-21.

ఒకే తల్లికి పుట్టిన కుమారులు
చిత్తవృత్తుల తేడాల్లో తెచ్చారు
అర్పణలు ఒకే దేవుని ఆరాధించిన
తర్వాత ఉత్తముని చంపిన ఉన్మాది
ఎవ్వరు ?

ఆది 4 అధ్యా.
1 యోహాను 3 : 11-12.

— ఎస్. జె. మేడిది, కొణిజివాడ.

---

## అంజూరపు చెట్టును గూర్చిన ఉపమానము

(లూకా 13.6-9; మార్కు 11:12-14, 20-24).

ఇది మన ప్రభువైన యేసు చెప్పిన ఉపమానములలో యొకటి. ఉపమానము లేక ఆయన యెన్నడు బోధింపలేదు. ఆయన మనకు మంచి బోధకుడు. అంజూరపు చెట్టునుగూర్చిన కొన్ని విషయాలు : పాలస్తీనా దేశములోని చెట్లన్నింటిలోను ప్రాముఖ్యమైనది. సంవత్సరము పొడవునా దీన్ని పెంచవచ్చు మంచి, చల్లని నీడ నిస్తుంది. దీన్ని సాధారణంగా ద్రాక్షతోటల్లో పెంచుతారు. ఈ చెట్టు సమాధానము నకు, అభివృద్ధికి గుర్తు.

ద్రాక్షతోటలో అంజూరపు చెట్టు నాటబడి పెంచబడు రీతిగ యూదా జనాంగము దేవునికి యిష్టమైన బిడ్డవలె ఆయనతో సంబంధము కలిగి ఆయనతో నడిపింపబడెను. ఈ ఉపమానములో మనము ద్రాక్షతోటను చూస్తాము. ఈ ద్రాక్షతోట యజమాని సైన్యముల కధిపతి యగు యెహోవా. ద్రాక్షతోట లోకము. క్రీస్తు పేరు ధరించుకొని జీవించు చుండిన మన మందరము ఆ తోటలోని ద్రాక్ష చెట్లు. (6వ). అతడు దాని పండ్లు వెదక వచ్చినపుడు యేమియు దొరకలేదు. ఈ పండ్లు గలతి 5:22 లో వ్రాయబడిన ప్రకారము ప్రేమ, సంతో

షము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము ఆశానిగ్రహము అను ఆత్మ ఫలములు.

మనము ఫలించుచున్నామా? ఎటువంటి ఫలములు ఫలించుచున్నాము? మన ఫలములు యితరులు అనుభవించి, ఆనందించుచున్నారా? మనలను మనమే ప్రశ్నించుకొని, స్వపరీక్ష చేసుకొనెదము. మనము ఫలించిన సరి. క్రీస్తు కొరకు మంచి పనివానిగ జీవించుచున్నావన్న మాట. అయితే నీవు ఫలింపక పోయినచో 7వ. లో వ్రాయబడినట్లు దీనిని నరికివేయుము. దీనివలన ఈ భూమియు ఏల వ్యర్థమై పోవలెనని ద్రాక్షతోటమాలితో చెప్పెను. ఈ తోటమాలి యెవరు? మన ప్రభువైన యేసుక్రీస్తే. ఈ ఉపమానము యూదా జనాంగము, యెరూషలేముయొక్క నాశనమును సూచించుచున్నది. నామమాత్రపు క్రైస్తవ జీవితము జీవించుచున్న వారి గతియు అట్టిదేనని మనము గ్రహించాలి.

అయితే ఈ ద్రాక్ష తోటమాలి యజమానుని అడుగుచున్నాడు. (8వ.) అయ్యా, నేను దాని చుట్టూ త్రవ్వి, యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరముకూడ ఉండనిమ్ము. అది ఫలించిన సరి, లేనియెడల నరికించివేయుము.

తిరుగుబాటు చేయుచున్న యూదా జనాంగమునకు దేవుడు మరియొక తరుణమిచ్చి ఈ సంవత్సరము కూడ ఉండనిమ్మని అడుగుచున్నాడు. దేవుడనుగ్రహించుచున్న అనేక తరుణములను సద్వినియోగము చేసికొనక, ఆయన ఆజ్ఞలను గైకొనక నామమాత్రపు క్రైస్తవ జీవితము జీవించుచున్నవారిని గూర్చి ప్రభువు అడుగుచున్నాడు. ఈ సంవత్సరము కూడ ఉండనిమ్మని, మరీ సంవత్సరములో నీవు ప్రభువు కొరకు యెటువంటి ఫలములు ఫలింపదలచుకున్నావు?

ఆయనను వెంబడించువారు (మత్తయి 5 : 13) లోకమునకు ఉప్పయి యున్నారు. మన జీవితములు ఉప్పుసారము కలిగి యుండాలి.

ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడువారికి (మత్తయి 7:19): ఆయనను వెంబడింపక, ఆయన ఆజ్ఞలను గైకొనక, వాక్యమున కవిధేయులై స్వంత యిష్టానుసారముగా జీవించేవారికి కలుగు దుస్థితి యిది. ఇట్టి దుస్థితినుండి నీవు తప్పించబడ నాశించుచుంటివా?

ఈ సంవత్సరము కూడ ఉండనిమ్మని ఈ తోటమాలి యజమానుని బ్రతిమలాడుచున్నాడు. ఎంత ఓర్పు, దీర్ఘశాంతము ఈ తోటమాలికి గలవో చూడండి. దేవుని కవిధేయులై జీవించుచున్న వారిని గూర్చి మన ప్రభువైన యేసు ఎంత ప్రేమ, దీర్ఘశాంతము కలిగి యున్నారో ఆలోచించి చూడండి. (యోహాను 15 : 6). ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి ఎండిపోవును. మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి పారవేతురు. అవి కాలిపోవును. ఇట్టి నాశనకరమైన స్థితి రాకుండ జాగ్రత్త పడుదము.

(7వ) ఈ మూడు సంవత్సరములనుండి ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదకవచ్చుచున్నాను. కాని ఏమియు దొరకలేదు. సంవత్సరముల వెంబడి సంవత్సరములు గతించిపోవు చున్నప్పటికిని తగిన ఫలములు క్రీస్తుకొరకు ఫలించనందున మన యెడల కూడ అట్టి దీర్ఘశాంతము వహించి నాశనమునుండి మనలను తప్పించుటకై 2 పేతురు 3:9లో వ్రాయబడిన ప్రకారము ప్రభువు అట్టి దీర్ఘశాంతము గలవాడై యున్నాడు.

ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము. ఈ సంవత్సరము నీకు ఈవిగా ప్రభువు తన కృపను బట్టి నీకు అనుగ్రహించాడు. దీన్ని సద్వినియోగం చేసికో. (యోహాను 15:7). నాయందు మీరును, మీ యందు నా మాటలును నిలిచియుండిన యెడల మీ కేది యిష్టమో అడుగుడి అది మీ కనుగ్రహింపబడును.

క్రీస్తుప్రభువు కొరకు మంచి ఫలములు ఫలించండి. గొప్ప దీవెనలు ఈ సంవత్సరములో పొందండి.

—జెస్సీ జేసన్, కాకినాడ.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**S A T Y A W A K K U**
P.O. Box. 8O
KAKINADA—533 001

No.

To

..................................................

..................................................

..................................................

..................................................